108 అంబులెన్స్ వచ్చేనా?

- రెండు మండలాలకు ఒకే వాహనం
- అత్యవసర వేళలో తప్పని ఇక్కట్లు
- ఎమ్మెల్యే గారూ.. జర దృష్టి పెట్టండి



రెండు మండలాలకు కలిపి వినియోగిస్తున్న 108 వాహనం



108 అంబులెన్స్ కోసం ఎదురుచూస్తున్న క్షతగాత్రులు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: అత్యవసర వేళలో ప్రాణాలను కాపాడే ఉచిత 108 వాహన అంబులెన్స్ అందుబాటులో లేదు. దాంతో రోడ్డు ప్రమాద బాధితులు, క్షతగాత్రులు, కాన్పు సమయంలో మహిళలు, అత్యవసర వైద్యం కోసం పడే ఇక్కట్లు వర్ణనాతీతంగా మారాయి. గడిచిన కొన్నేళ్లుగా ఇక్కడ అంబులెన్స్ సమస్య వేధిస్తుండగా, అధికారులకు కనీసం పట్టడం లేదు. వివరాలిలా ఉన్నాయి.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హాయంలో ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకొచ్చిన 108 అంబులెన్స్‌ను అశ్వారావుపేట మండలానికి సైతం కేటాయించారు. ఈ అంబులెన్స్ ద్వారా ఆ నాటి నుంచి 2017 వరకు మండల ప్రజలకు సేవలందాయి. కాగా అంబులెన్స్ సిబ్బందికి క్వార్టర్స్, వాహనానికి షెడ్డు లేదనే కారణంతో అశ్వారావుపేట అంబులెన్స్‌ను ఆ నాటి అధికారులు దమ్మపేట మండలానికి తరలించారు. ఆప్పటి నుంచి 108 వాహనం అక్కడి నుంచే రాకపోకలు చేస్తూ, అరకొర సేవలు అందిస్తోంది. దాంతో స్థానికులకు అంబులెన్స్ కష్టాలు తప్పడం లేదు. స్థానికంగానే 108 వాహనాన్ని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మొరపెట్టి పట్టించుకునే నాధులే లేరు. స్థానికంగా ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉండగా, ఆ దిశగా చర్యలు తీసుకొకుండా ఆ నాటి అధికారులు ఆనాలోచితంగా వాహనాన్ని దమ్మపేటకు మార్పు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అత్యవసర వేళలో ఇక్కట్లు..

అశ్వారావుపేటలో సీహెచ్‌సీ(ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి)తోపాటు, మండలంలోని వినాయకపురం, గుమ్మడవల్లి గ్రామాల్లో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో రోజుకు సుమారు 1500 నుంచి 2000 వేల దాకా ఓపీ ఉంటుంది. ఇక రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర కేసులు నిత్యం పదుల సంఖ్యలోనే నమోదు అవుతున్నాయి. అశ్వారావుపేట మండల కేంద్రం నుంచి ఖమ్మం-సత్తుపల్లి, ఏపీలోని ఏలూరు జిల్లా హైవే దారి విస్తరించి ఉండగా, భద్రాచలం వెళ్లే వైపు డబుల్ రహదారి ఉంది. ఈ మూడు రహదారుల్లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ మార్గాల్లో జరిగే రోడ్డు ప్రమాదాల్లో నిర్ణిత సమయంలో అంబులెన్స్ సేవలు అందుబాటులో లేక మృత్యువాత పడుతున్నారు. ఆయా ప్రమాదాల్లో గాయపడే, పరిస్థితి విషమంగా ఉండే వారి సంఖ్యలో అధికంగానే ఉంటుండగా, వీరికి అంబులెన్స్ అందుబాటులో లేక బాధితులు, క్షతగాత్రుల ఆర్త నాదాలతో అల్లాడిపోతున్నారు.

ఒక్క అశ్వారావుపేట మండలంలోనే ఏడాదికి 20 నుంచి 30 మంది వరకు రోడ్డు ప్రమాదాలు, ఇతర కారణాలతో మృతి చెందుతున్నారు. ఆయా మృతుల్లో అధికంగా సకాలంలో అంబులెన్స్ ఘటన స్థలానికి చేరుకొకపోవడమేననే విమర్శలు ఉన్నాయి. అంతేకాదు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, అత్యవసర వేళలో 108 వాహనాన్ని సంప్రదిస్తే గంటల కొద్ది సమయం పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ..

మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఎక్కడ ప్రమాదాలు చోటు చేసుకున్న, అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లాలంటే ప్రైవేటు అంబులెన్స్ లేదా, స్వచ్ఛంద సంస్థ, ప్రైవేటు వాహనాలే దిక్కుగా మారాయి. అశ్వారావుపేట మండలంలోని ఏదైనా ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగితే 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న దమ్మపేట నుంచి 108 వాహనం ప్రమాద స్థలానికి చేరుకోవాంటే ఆలస్యం అవుతుండటంతో పరిస్థితి విషమంగా ఉంటే క్షతగాత్రుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. అంతేకాదు స్థానిక ఆస్పత్రుల నుంచి పరిస్థితి విషమంగా ఉన్నవారిని మొరుగైన వైద్యం కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లి, ఖమ్మం తరలించేందుకు బాధిత కుటుంబీకులు, బంధువులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. దాంతో అత్యవసర సమయాల్లో ప్రైవేటు అంబులెన్స్, వాహనాలే దిక్కుగా మారుతున్నాయి. ఆయా సమయాల్లో ప్రైవేటు వాహనాలు కుడా అందుబాటులో లేకపోతే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది .నిరుపేదలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. దమ్మపేటలో ఉన్న 108 వాహనాన్ని అశ్వారావుపేటకు తరలించేలా చూడాలని మొరపెట్టుకుంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

అశ్వారావుపేటకు 108 వాహనం లేదని, అంబులెన్స్‌ను కేటాయించాలని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కొన్నేళ్లుగా అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు ఒకే వాహనం ద్వారా సేవలు అందిస్తున్నాం. దీనిపై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వాహనాన్ని మంజూరు చేసేలా కృషి చేస్తున్నాం.

– దుర్గా ప్రసాద్, 108 జిల్లా కోఆర్డినేటర్

సింగరేణి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఏరియా అధికార ప్రతినిధి ఎస్.రమేష్, ఏఎల్‌సీ అధికారులు తెలిపారు. మణుగూరు ఏరియాలో గుర్తింపు సంఘ ఎన్నికల నిర్వహణ కోసం ఏడు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 2,450మంది ఉద్యోగ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఏరియాలోని ప్రాజెక్ట్ ఆఫీస్‌లో రెండు, కేసీహెచ్‌పీ మ్యాన్‌వే ఆఫీస్, ఓసీ4 మైన్ ఆఫీస్, కొండాపురం భూగర్భగని మైన్ ఆఫీస్, సింగరేణి గెస్ట్ హౌజ్, మణుగూరు ఓసీ సేఫ్టీ ఆఫీసర్ రూమ్‌లను కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. నేటి ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహణ జరగనుంది. ఉద్యోగ ఓటర్ పోలింగ్ కేంద్రానికి వచ్చేటప్పుడు తమ తమ గుర్తింపు కార్డులను తెచ్చుకోవాల్సి ఉంటుంది. భారీ భద్రతల నడుమ పోలింగ్ ప్రక్రియ అనంతరం పివికాలనీలోని సిఇఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. కాగా ఎన్నికలల్లో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్, బీఎంఎస్, సీఐటీయూ, హెచ్ఎంఎస్, ఇఫ్టుతో మరో ఆరు కార్మిక సంఘాలు పోటీ చేయనున్నాయి. నేటి రాత్రితో సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఎవరిని విజయం వరించనుందో తేలనుంది.

పేదలకు సంక్షేమం అందాలి



మట్లాడుతున్న కొక్కెరపాటి పుల్లయ్య

దమ్మపేట: అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి, సంక్షేమ పథకాలు తప్పనిసరిగా ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం మండల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ.. ఇటీవలే కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అర్హత గల ప్రతి పేదవాడికి అందించాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డు లేని సాకుతో పేద వారికి సంక్షేమ పథకాలు ఇవ్వని పక్షంలో పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యంద్రాతి అప్పారావు, దొడ్డా లక్ష్మీనారాయణ, కొప్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు సహకరించాలి

చర్ల: ఆరు గ్యారెంటీల అమలుకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు డిశంబర్ 28 నుండి జనవరి 6 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా.. ఎవరైనా ఆటకం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని చర్ల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బీ రాజగోపాల్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత వంటి పథకాల ద్వారా అన్నీ వర్గాల ప్రజలు లబ్ది పొందేందుకు గ్రామపంచాయతీల వారీగా ఏర్పాటు చేసే కేంద్రాలకు నేరుగా వెళ్లి దరఖాస్తులను అందజేయాలని ఆయన సూచించారు. సంక్షేమ పథకాల అమలు కోసం ప్రజాపాలన పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఎవరైనా ఆటకం కలిగించినా, ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఇబ్బంది కలిగించా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ప్రజా పాలన ప్రశాంతంగా కొనసాగేలా సహకరించాలని మణుగూరు సీఐ రమాకాంత్ అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారెంటీ పథకాలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు ప్రభుత్వం అమలుచేయబోయే మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత వంటి పథకాల ద్వారా లబ్ది పొందేందుకు నిర్వహించే సదస్సులో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, అధికారులు సహకరించాలని కోరారు.

అక్షింతల శోభాయాత్ర

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో మంగళవారం అయోధ్య భవ్యరామ మందిర చెందిన అక్షింతలతో శోభయాత్ర నిర్వహించారు. అయోధ్యలో ఈ జనవరి 22న, బలరాముడు ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని విశ్వహిందు పరిషత్ ప్రకండ సభ్యులు కుక్కడపు రామారావు తెలిపారు. అక్షింతలను ప్రతీ గ్రామంలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ బాధ్యులు భోగి కృష్ణ, నల్లమోతు రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎర్రజెండా

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని పార్టీ కార్యాలయాలు, సంఘాల కార్యాలయాలు, అమరుల స్తూపాల వద్ద పార్టీ నాయకులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీపీఐ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పేద ప్రజలకు, కార్మిక వర్గానికి ఎల్లవేళలా ఎర్రజెండా అండగా ఉంటుందని, వారి పక్షన ఎన్నో పోరాటాలు చేశామని అన్నారు. పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: ఎర్రజెండా ఎగురవేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అయోధ్య



చర్లలో ఆవిర్భావ వేడుకలు..



భద్రాచలం పట్టణంలో..



అశ్వారావుపేటలో..




దుమ్ముగూడెంలో..

‘వంగవీటి’ వర్ధంతి

అశ్వారావుపేటరూరల్: వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాన్ని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వర్ధంతి సందర్భంగా స్థానిక అమ్మ సేవా సదనంలోగల అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోట బాలు, కొట్టి శ్రీనివాసరావు, నరేష్, సుభాష్ పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యానికి డిమాండ్

- మద్దతు కంటే ఎక్కువ చెల్లిస్తున్న ప్రైవేటు వ్యక్తులు
- వారివైపే మొగ్గు చూపుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల వైపు ఆసక్తి చూపని వైనం



కల్లంలో ఆరబోసిన సన్నరకం ధాన్యం

చర్ల: సన్నరకం ధాన్యానికి డిమాండ్ పెరిగింది. ఖరీఫ్ సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా రైతులు పండించిన సన్న రకం ధాన్యనికి భారీగా డిమాండ్ పెరగడంతో రైతుల ఆనందానికి అవదులు లేకుండా పోతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇస్తున్న మద్దతు ధరకంటే ప్రైవేటు వ్యక్తులు ధర ఎక్కువగా వస్తుండడంతో రైతులు మిల్లర్లు, ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకునేందుకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. రైతులు వరి కోత కోసిందే ఆలస్యం మిల్లర్లు, ప్రైవేటు వ్యక్తులు, సన్న రకం బియ్యంతోనే భోజనం చేసే వారు, మొద్దు రకం ధాన్యాన్ని సాగు చేసిన రైతులు, నెల నెలా షాపుల లో సన్న బియ్యాన్ని కొనుగోలు చేసుకునే వారు ఒకే సారి సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లింగ్ చేయించి నిల్వ ఉంచుకుంటే డబ్బులు కలిసొస్తాయనుకునే వారు పెద్ద ఎత్తున నేరుగా రైతుల కళ్లాల్లోకి వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రైతులు వారు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్మాలంటే తేమ శాతం 17 వచ్చేంత వరకు ఆరబెట్టాలని అవి ఆరడానికి వారం నుంచి 10 రోజులు సమయం పడుతుందని ఈ లోపు ఏ మాత్రం తేలికపాటి వర్షం వచ్చినా ధాన్యం తడిసి నష్టం వాటిల్లడంతోవారం పది రోజుల పాటు వాటిని రోజు నెరపడం సాయంత్రం టార్ఫాలిన్లు కప్పడం మళ్లీ ఉదయం తీయడం వంటి పనులు చేయాల్సి ఉండడంతో ఈ ఇబ్బందులన్నీ ఎందుకులే అనుకొని రైతులు మిల్లర్లకు, ప్రయివేటు వ్యక్తులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.2,203లు, సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,183లు చెల్లింస్తుండగా రైతులు వంట కోసిన వెంటనే ప్రయివేటు వ్యక్తులు, మిల్లర్లకు అమ్మితే రూ ఎటువంటి శ్రమ లేకుండా రూ.2,100 నుంచి రూ.2,200 వరకు వస్తుండడంతో రైతులు ప్రయివేటు వైపు మొగ్గు చూపుతున్నారు.

18 వేల ఎకరాల్లో వరి..

చర్ల మండలంలో ప్రధాన సాగునీటి వనరు అయిన తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుతో పాటు బోర్లు, చెరువుల క్రింద సుమారు 18 వేల ఎకరాల్లో రైతులు వరి పంటలను సాగు చేశారు. రైతులు సాగు చేసిన వరి రకాల్లో ఒక వంతు మాత్రమే 1001, 1121 అంటి మొద్దు రకం వరి పంటను సాగు చేయగా మూడు వంతుల మేర 1061, 1064, 1262, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, సోనా మసూరి, బీపీటీ వంటి రకాలను రైతులు సాగు చేశారు. ఈ క్రమంలో ఎక్కువ శాతం సాగు సన్నాల్లో సాగవ్వడంతో వారు పండించిన పంటకు కొనుగోలు కేంద్రాల కన్నా ఎటువంటి అదనపు ఖర్చులు లేకుండా భయట వ్యక్తుల వద్దే ఎక్కువగా ధర వస్తుండడంతో ఎక్కువ మంది రైతులు ప్రైవేటు వ్యక్తులకు వారి ధాన్యాన్ని అమ్మజూపుతున్నారు.

కేంద్రాలకు తగ్గిన ధాన్యం..

రైతులు ఖరీఫ్‌లో పండించిన సన్నరకం ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలలో అమ్మేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 శాతం కంటే ఎక్కువగా ఉండరాదు. ఒక వేళ కొనుగోలు కేంద్రాలలో నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేస్తే వాటిని మిల్లర్లు తిరస్కరించడంతో పాటు ధాన్యానికి కోత విధిస్తే ఆ భారం అంతా రైతుల మీదనే పడుతుంది. వరి కోత యంత్రాలతో పంట కోసిన తరువాత వాటిని రోజుల తరబడి కళ్లాల్లో ఆరబోయాల్సి ఉండగా అందుకు అదనపు ఖర్చుతో పాటు అవుతుండడంతో రైతులు కేంద్రాలలో అమ్మేందుకు మొగ్గు చూపడం లేదు.

సమయంతో పాటు ఖర్చు తగ్గుతోంది



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మాలంటే సవాలక్ష ఆంక్షలు విధిస్తున్నారు. వంట కోసిన తరువాత వారం పది రోజుల పాటు కళ్లాల్లో ఆరబోయడం, వాటిని రోజు తిరగేస్తుండడం, అందుకు అవసరమైన టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకోవడం వంటి వాటి వల్ల చాలా ఖర్చు అవుతోంది. ఇటువంటివేమీ లేకుండా కోసిన వెంటనే దాన్యాన్ని భయటి వ్యక్తులకు అమ్మడంతో సమయంతో పాటు ఖర్చు కూడా తగ్గుతోంది. అందు వల్లే ప్రైవేటుకు ధాన్యాన్ని అమ్ముతున్నాం.

– తడికల నర్సింహారావు, రైతు, కుదునూరు

సన్నం రకానికి బయటే ఎక్కువ ధర



కొనుగోలు కేంద్రాలలో అమ్మిన దాని కంటే బయట అమ్మితేనే ఎక్కువ ధర వస్తోంది. కొనుగోలు కేంద్రంలో క్వింటాకు రూ 2,203లు ఇస్తుండగా, భయటి వ్యక్తులు మాకు ఎటువంటి అదనపు ఖర్చులు లేకుండా రూ.2,200 నుంచి రూ 2.250 వరకు ధర చెల్లిస్తున్నారు. కేంద్రంలో అమ్మడం వల్ల క్వింటాకు సుమారు రూ.100 అదనపు ఖర్చు అవడంతో పాటు సమయం కూడా వృథా అవుతోంది. కొలుకు రైతులకు బ్యాంకు ఖాతాలోనే పది నుంచి 20 రోజుల తరువత జమ అవుతాయి. కానీ ప్రయివేటు అయితే వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారు.

– ఇందుల బుచ్చిబాబు, రైతు, ఆర్ కొత్తగూడెం

కమ్మేసిన పొగమంచు



కరకగూడెం ప్రధాన రహదారిపై పొగమంచు

కరకగూడెం: మండలంలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. దీనికి తోడు మంగళవారం గిరి పల్లెలను మంచు దుప్పటి కమ్మేసింది. ఉదయం 11 గంటల వరకు కూడా మంచుకప్పి ఉండడంతో జనం బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు కూడా 9 గంటల వరకు కూడా లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. మరికొంత మంది మంచులోనే తమ విధులను నిర్వహించారు. అంతేకాకుండా మంచు కురవడంతో పొలాలు, వివిధ ప్రదేశాలు సరికొత్త అందాలతో కనువిందు చేసి ముగ్ధమనోహరంగా మారిపోయాయి. ఈ చిత్రాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. మరో మూడ్రోజులు చలి ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ సూచనలతో ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి దుర్గా భవాని సూచించారు.



మంచులోనే పొలం పనులకు వెళ్తున్న రైతులు

క్లుప్తంగా

హెల్మెట్ విధిగా ధరించాలి

ములకలపల్లి: ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం.రాజమౌళి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపరాదని అన్నారు. మైనర్ బాలలకు బైక్‌లు ఇవ్వవద్దని తెలిపారు. మోటారు వాహనాలకు ఖచ్చితంగా అన్నిరకాల పత్రాలు కలిగా ఉండాలని తెలిపారు. యువత మద్యం, గంజాయి, బెట్టింగ్ వంటి దుర్‌వ్యవసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కోడిపందేలు, పేకాట వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు అన్నదానం

మణుగూరురూరల్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కేసీహెచ్‌పీలో సూపరింటెండెంట్ ఇంజనీర్ అల్లారి నిరంజన్‌బాబు-విజయలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో పీవీకాలనీలోని శ్రీవిద్యాభ్యాస(బాలవెలుగు) పాఠశాల విద్యార్థులకు మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు రవికుమార్ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిరంజన్‌బాబు కుటుంబ సభ్యులు నిఖిల, నమృత, సీహెచ్ నరసింహాచారి, నిర్మలాదేవి, వర్ష, పద్మజ, సింగరేణి సేవా సమితి సభ్యుడు నాసర్‌పాషా, పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది సుహాసిని దేవి, రాధ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రగ్గుల పంపిణీ



ఆదివాసీలకు రగ్గులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చర్లరూరల్: హైదరాబాద్‌కు చెందిన రాబిన్ హుడ్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చర్ల మండల ఏజెన్సీ ఆదివాసీ గ్రామాలైన చెన్నాపురం, ఎర్రంపాడు, రాళ్ళాపురం, కందిపాడులలో నివసించే 350 కుటుంబాలకు రగ్గులను అందజేశారు. అనంతరం చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యానిలయంలోని 26 మంది విద్యార్థలకు చలికోట్లను పంపిణీ చేశారు. హైదరాబాద్‌లోని పలువురి దాతలనుంచి సేకరించిన విరాళాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. గతంలో జిల్లాలోని పినపాక, కరకగూడెం మండలాల్లోని గిరిజనులకు సోలార్ దీపాలు, దుస్తులను అందజేశామని, ఏజెన్సీ గ్రామాల్లో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు గొడుగులు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం భద్రాచలం పట్టణంలోని ఫుట్‌పాత్ వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఎండ తీవ్రతను ఉన్నప్పుడు, వర్షం పడుతున్న సమయంలో ఫుట్‌పాత్ వ్యాపారులకు లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ, కోశాధికారి జి.భరత్ కుమార్, లయన్ మెంబర్స్ దాట్ల శ్రీనివాస్ రాజు, ఏగి వెంకటరమణ, బి.రంగారెడ్డి, పారెల్లి సంతోష్ కుమార్, ఎండూరి భద్రం, పంజా సునీల్ కాంత్, ఎం.సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

చండీహోమం..



హోమం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో చండీ హోమం జరిపించారు. మంగళవారం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయంలో శ్రీస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకుడు సత్యనారాయణ శర్మ వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా చండీహోమాన్ని జరిపించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సీపీఎం నాయకుడి మృతి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన మేకల వెంకులు(85) అనారోగ్యం, వయోభారంతో మంగళవారం మృతి చెందారు. కాగా వెంకులు సీపీఎం పార్టీ సానుభూతి పరుడుగా ఉండగా, ఈ విషయాన్ని తెలుసుకున్న ఆ పార్టీ జిల్లా కమిటీ నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, పిట్టల అర్జున్, దొడ్డా లక్ష్మీనారాయణ, దమ్మపేట మండల నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు తోపాటు పలువురు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబీకులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.